క్లుప్తంగా

టీజీఓ కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శిగా నియామకమయ్యారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతిభ, ప్రసంగాలు, చైతన్య యాత్ర సదస్సులు, వ్యాసాలను అందించి క్రియాశీలక పాత్ర పోషించారు. ఈ మేరకు పలు సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం నేతలు వస్కుల శ్రీనివాస్, హరగోపాల్ అభినందించారు. ఆజం, గణేశ్, గ్రంథ పాలకుల సంఘం నేతలు బాలునాయక్, సుధీర్‌కుమార్, పలు ఉద్యోగ సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సక్రమంగా నిర్వహించాలి



ధర్మసాగర్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సక్రమంగా నిర్వహించాలని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండలంలోని ఎల్కుర్తి గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు, మొబైల్ యాప్ సర్వేను శనివారం ఎంపీడీఓ అనిల్ కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి త్వరగా పనులు పూర్తిచేసి జూలై మాసం వరకు మొక్కల పంపిణీకి సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సంపత్, పంచాయతీ కార్యదర్శి భీమరాజు, టీఏ మధుకర్, కరుణాకర్, ఎఫ్ఏ కవిత పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కమలాపూర్ : మండలంలోని గూనిపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూనిపర్తి సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ లైన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా గూనిపర్తి, శ్రీరాములపల్లి, అంబాల గ్రామాల్లో ఆదివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కమలాపూర్ : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, దుర్వేష్, రాజు, శ్రీధర్, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



దామెర : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దండు రాజు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో శనివారం మాలమహానాడు ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోతుల కొమ్మాలు, నాయకులు కూనమల్ల రవీందర్, సుదమల్ల మహేందర్, కార్తీక్, ఆసోద భిక్షపతి, ఐలయ్య, చంద్రమౌళి, రామస్వామి, రవీందర్, రాములు, మహేందర్, వేణు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేలేరు : పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ మండల కార్యదర్శి వేల్పుల రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా ఎన్నికై బాధ్యతగల పదవిలో ఉన్న అమిత్ షా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. తన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు నర్సయ్య, భాస్కర్, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా బస్సు ఎరగని పల్లెలు

- గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లికి కరువైన ఆర్టీసీ బస్సు సేవలు
- పలుమార్లు విన్నవించినా స్పందించని అధికారులు
- కాలినడకే శరణ్యమంటున్న స్థానికులు, విద్యార్థులు



వేలేరు పాఠశాల నుంచి నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

వేలేరు : మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతీ పల్లెకు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను నడిపిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించుకున్నా.. పలు గ్రామాలకు అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లి గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలు, లేదా కాలినడకన సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేలేరు మండల కేంద్రానికి చేరుకుని బస్సెక్కాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. అలాగే రెండు సంవత్సరాల కిత్రం మండలానికి సంబంధించిన కేజీబీవీ పాఠశాలను గొల్లకిష్టంపల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. ప్రతీరోజు పాఠశాలకు వచ్చే టీచర్లు, విద్యార్థినులు, పిల్లలను చూసేందుకు వచ్చే తల్లిదండ్రులకు రవాణా కష్టాలు తప్పడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అధికారులు బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేయలేదు. కొన్ని సంవత్సరాల కిత్రం బీటీ రోడ్డు వేయడంతో బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రజలు ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనే పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యవసర సరుకులు, వైద్యం, హైస్కూల్ విద్య, కూరగాయలు ఇలా ఏది కావాలన్నా ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాల్సిందేనని అంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మండలంలోని గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నాం. అయినా ఫలితం లేదు. అత్యవసర పరిస్థితి వస్తే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రతీ అవసరానికి వేలేరు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– బత్తుల శ్రీనివాస్, గొల్లకిష్టంపల్లి

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్



ఆత్మకూరు : గణిత దినోత్సవంతో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పరకాల : బిట్స్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల గణితశాస్త్ర ప్రదర్శన

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నిర్మలాకుమారి గణిత శాస్త్ర ఉపాధ్యాయులు వేమారెడ్డి, రజిత విద్యార్థులతో మ్యాథ్స్ ఎగ్జిబిట్లు, మ్యాథ్స్ రంగోలిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ విజయ్‌కుమార్ హాజరై మ్యాథ్స్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఎగ్జిబిట్లలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. ఉపాధ్యాయులు వేమారెడ్డి, సమత, శ్రీదేవి, రాజు, సోమయ్య, సుజాత, వసంత, రవి, జోసెఫిన్, ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల : గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని బిట్స్, శారదా విద్యాలయంలో గణిత దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గణిత ప్రదర్శనలు, గణిత రంగవల్లి, గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. గణిత ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. బిట్స్‌లో జరిగిన ప్రదర్శనలను చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ యుగేందర్, ఉపాధ్యాయులు తిలకించారు. అదే విధంగా శారదా విద్యాలయంలో జరిగిన ప్రదర్శనను ప్రిన్సిపల్ మార్క సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు తిలకించారు.

శాయంపేటలో కుక్కల దాడులు

- వ్యక్తికి గాయాలు



శాయంపేట : మండల కేంద్రంలో రోజురోజుకు కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ప్రతి వీధిలో గుంపులుగా ఉంటూ స్థానికులపై దాడులకు తెగబడుతున్నాయి. ప్రధాన రహదారిలో వెళ్లే ద్విచక్ర వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. శనివారం ఉప్పునూతుల దేవేందర్ ఉదయం వాకింగ్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా చేనేత సొసైటీ ఎదుట ఒకేసారిగా 10 కుక్కలు దాడి చేసి గాయపరిచాయని బాధితుడు వాపోయాడు. స్థానికులు గమనించి కర్రతో బెదిరించడంతో అతడిని వదిలి వెళ్లిపోయాయి. ఈ ఘటనలో దేవేందర్ కుడి చేతికి, ఎడమ కాలికు గాయమై తీవ్ర రక్త స్రావం అయినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అతడిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్య సిబ్బంది రేబిస్ వాక్సిన్లు వేసినట్లు తెలిసింది. ఇప్పటికై నా అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడదను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పదవుల కంటే ప్రజా శ్రేయస్సు ముఖ్యం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మహిళలకు మిషన్‌లు అందజేస్తున్న ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

పరకాల : పదవులు శాశ్వతం కాదని, ప్రజలే తనకు ముఖ్యమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్.ఆర్ గార్డెన్‌లో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్‌ల పంపిణీ జరిగింది. పరకాల, దామెర మండలాలకు చెందిన 650 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టిన పరకాల నియోజకవర్గం ఏడాదిలో ఏలాంటి అభివృద్ధికి నోచుకోక వెనుకబడిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకే నేడు కాంగ్రెస్ పాలకులు శిలాఫలకాలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. వేలాది మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో గీసుకొండ శివారులో కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు 1350 ఎకరాల భూమిని రైతుల సహకారంతో సేకరించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కుట్టు మిషన్‌లో శిక్షణ పొంది సర్టిఫికెట్లు తీసుకున్న మహిళలకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించే కుట్ర కుట్ర జరుగుతుందని ఆరోపించారు.

పరామర్శ..

దామెర : మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కన్నెబోయిన రమేశ్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. కొద్ది రోజులుగా రమేశ్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సపొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగితెలుసుకున్నారు. మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, నాయకులు కృపాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శంకర్, వెంకటేశ్వర్లు, సతీష్, శరత్ ఉన్నారు.

ఆత్మకూరు : కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టులో ఇటీవల మృతిచెందిన నిమ్మల సాంబయ్య కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు పార్టీ తరుపున ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, గండు రాము, మాజీ సర్పంచ్ నరేష్ పాల్గొన్నారు.

పరామర్శలు..

కమలాపూర్ : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చేనేత కార్మికుడు చెనుమల్ల మొండయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గం రవి అండగా నిలిచారు. ప్రణవ్ పంపించిన రూ.5 వేలతో పాటు స్వర్గం రవి పంపించిన రూ.5 వేలు కలిపి మొత్తం రూ.10 వేలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణి శనివారం బాధిత కుటుంబానికి అందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు విష్ణుదాసు వంశీధర్‌రావు, భిక్షపతి, అశోక్‌జీ, రమేశ్, నర్సయ్య, శ్రీకాంత్, మొగిలయ్య, లక్ష్మీనారాయణ, సాంబయ్య, చిరంజీవి, పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ కోడెపాక రాజయ్య ఇటీవల మృతిచెందాడు. కాగా శనివారం ఎంపీఓ చేతన్ కుమార్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా ప్రభుత్వ నుంచి వచ్చిన రూ.10వేలను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్, మల్టీపర్పస్ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు రామన్న, ప్రధాన కార్యదర్శి రమేశ్, కారోబార్ వినయ్ తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో ఇద్దరి అరెస్ట్

ఎల్కతుర్తి : పోక్సో కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయిబాబు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన రేస్ అనిల్, బొల్లనపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు ఓ బాలికను వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా 'రేవూరి' మిత్రమండలి



నినాదాలు చేస్తున్న మిత్రమండలి సభ్యులు

దామెర : ప్రజాసేవే లక్ష్యంగా రేవూరి మిత్రమండలి పనిచేస్తుందని ఆ సేవా సంఘం అధ్యక్షుడు కూనాటి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఊరుగొండలో మిత్రమండలి టీషర్టులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. రానున్న రోజుల్లో మిత్రమండలి ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కందికొండ సంపత్, గ్రామశాఖ ఉపాధ్యక్షుడు వేల్పుల మధూకర్, సభ్యులు చెట్టుపల్లి మధూకర్, గన్నారం వంశీ, లింగంపల్లి రాజయ్య, పాలెపాక అనిల్, కోలె రాజు, గన్నారం శివాజీ, జన్ను సారయ్య, జన్ను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోసీమీ, కరస్పాండెంట్ లిస్‌మెరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

ఎల్కతుర్తి : నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్సై సాయిబాబు హెచ్చరించారు. హుస్నాబాద్‌కు చెందిన సతీష్ అనే వ్యక్తి భీమదేవరపల్లి మండలం కొత్తకొండ, గట్లనర్సింగాపూర్, ముల్కనూరు గ్రామాల్లో పలు కిరాణాలకు పొగాకు ఉత్పత్తులను రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.35వేల విలువచేసే పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని కామారం బస్టాప్ వద్ద గీసుకొండ మండలం ఎలుకుర్తి హవేలికి చెందిన మార్త రమేశ్ తన బ్యాగులో రూ.2,939 విలువచేసే పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు, పాన్‌బహార్ బ్యాకెట్లు బ్యాగులో పెట్టుకొని ఎక్కువ ధరకు విక్రయించే క్రమంలో పట్టుకున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అమరుల ఆశయాలు కొనసాగిస్తాం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి : అమరుల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మంచాల తిరుపతి సంతాప సభ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. మంచాల తిరుపతి మరణం పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమ పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్‌లో చురుకుగా పాల్గొని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన తిరుపతి సేవలు మరవలేనివని కొనియాడారు. ఈ ప్రాంతంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూముల కోసం అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నెదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండ సదాలక్ష్మి, ఉట్కూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల్లో పోషక విలువలు



ఐనవోలు : పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, పేరెంట్స్



ధర్మసాగర్ : ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఐనవోలు : పండ్లు, కూరగాయల్లో అనేక పోషక విలువలు ఉంటాయని ఏఏపీసీఈ అధ్యక్షురాలు పొన్నం రమ అన్నారు. మండలంలోని పున్నేలు ప్రభుత్వ పాఠశాలలో శనివారం పేరెంట్, టీచర్ సమావేశం జరిగింది. ముందుగా విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలతో స్టాల్స్ ఏర్పాటు చేయగా పేరెంట్స్, టీచర్స్ ఆరోగ్యకరం, రుచికరంగా తయారు చేసిన పదార్థాలను పరీక్షించి ఇద్దరు విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ధ్యానం చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పౌష్టికాహారంతో కూడిన ఫుడ్‌కు ప్రథమ బహుమతి ఇల్లందుల రోహణ ప్రసాద్‌కు, ద్వితీయ బహుమతి గాదె హర్షకు అందజేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ అధ్యక్షురాలు పొన్నం రమ, హెచ్ఎం రాయరాకుల పరమేశ్వర్, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం విష్ణుప్రియ, ఉపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, అన్నారెడ్డి, ఇందిరా, రాహుల్‌కుమార్, వెంకటయ్య, స్వప్న, నిర్మల, విమల తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఎత్నిక్ డే, తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. సాంస్కృతిక అవగాహనను పెంపొందించడం, సాంప్రదాయ వారసత్వాన్ని సంరక్షించడం, తెలంగాణ గొప్ప వైవిధ్య ప్రదర్శణపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ సంస్కృతికి చాటి చెప్పారు. తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్‌లో వివిధ రకాల పిండి వంటకాలు, కూరలు, స్వీట్ వంటి అనేక రకాల సాంప్రదాయ వంటకాలు తయారీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్ఎం ధర్మప్రకాశ్ మాట్లాడుతూ.. సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు జాతి వైవిధ్యాన్ని పెంపొందించుకోవాల్సిన ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయులు కవిత, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయగా ఆహార పదార్థాల తయారీలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ మమత తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

- ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ రహీం

నడికూడ : మండలంలోని ప్రజలు వివిధ పథకాల ద్వారా తీసుకున్న బ్యాంకు రుణాలను నిర్ణయించిన సమయంలోగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం అన్నారు. శనివారం మండల కేంద్రంలో పరకాల ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు బ్యాంకులు ఇస్తున్న పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని చెల్లించలేని పరిస్థితి ఉంటే బ్యాంకు అధికారులను కలసి ఇబ్బందులు తెలుపాలని అన్నారు. తక్కువ వడ్డీతో రైతులకు పంట రుణాలు వేగంగా మంజూరు చేస్తున్నామని అన్నారు. అనంతరం ఐదుగురు రైతులను సన్మానించారు. మూడు మహిళా సంఘాలకు లోన్ మంజూరు చెక్‌లను అందించారు. మండల కేంద్రంలో బ్యాంక్‌తో పాటు ఎంటీఎం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు ఆర్ఎంకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ వరంగల్ చీఫ్ మేనేజర్ త్రివేణి, పరకాల బ్రాంచి మేనేజర్ సతీష్, ఎంపీఓ చేతన్ కుమార్‌రెడ్డి, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడిధారణ



ఆత్మకూరు : ఇరుముడి ధారణలో అయ్యప్ప స్వాములు



శాయంపేట : పడిపూజలో పడి వెలిగిస్తున్న గురుస్వాములు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పంచకూట మహాదేవస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులు శనివారం ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి ధారణ చేశారు. స్వాములు శబరిమల యాత్రకు బయలు దేరారు. ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది.

నగరసంకీర్తన

మండల కేంద్రంలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి వీధుల గుండా వేంకటేశ్వరస్వామి దీక్షాదారులు, భక్తులు నగరసంకీర్తన చేపట్టారు. గోవిందనామాలు, భజనలు చేస్తూ వీధుల్లో పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో వికాసతరంగిణి, భజనమండలి సభ్యులు పాల్గొనగా ఆలయంలో అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. తిరుప్పావై అనుసంధానం చేశారు.

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామంలో శనివారం అయ్యప్ప మహా పడిపూజను మాజీ ఉప సర్పంచ్ దుర్నాల రాజుబాబురావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. హరిహర క్షేత్ర ప్రధాన అర్చకుడు పద్మనాభ స్వామి మంత్రోచ్ఛరణ నడుమ పూలతో అలంకరించిన మండపంలో గణపతి– లక్ష్మీదేవి అయ్యప్ప పటాలను అలంకరించి స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆర్కెస్ట్రాతో భజన, అయ్యప్ప శరణుఘోషతో గ్రామమంతా మార్మోగింది. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ గురుస్వామి, సామల భిక్షపతి, జిన్నా శ్రీనివాస్‌రెడ్డి, తిప్పారపు ప్రభాకర్, మోర్తాల రాజేశ్వరరావు, హరీష్, కందగట్ల రమేశ్, గట్టు కిషన్, మార్త సుమన్, బొల్లపెల్లి సదానందం, గోరంటల ప్రశాంత్, బాసాని మల్లికార్జున్, బాలక్రిష్ణ, తిప్పారపు రాజు, రవీంద్రచారి పాల్గొన్నారు.